

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి యశస్వి పథకం కింద ఉపకార వేతనాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమాధికారిణి అనూరాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గుర్తింపు పొందిన పాఠశాలలు, కళాశాలల్లో 9, 10, ఇంటర్ చదువుతున్న బీసీ, ఈబీసీ కులాలకు చెందిన విద్యార్థులు ఈ నెల 15వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్ లోని జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.





కొబ్బరికి కష్టమొచ్చింది

- తెగుళ్ల బారినపడిన చెట్లు
- జీడిదీ అదే పరిస్థితి
- నష్టపోతున్న రైతులు
- పట్టని ఉద్యానశాఖ అధికారులు

రణస్థలంలోని ఓ కొబ్బరి తోటలో చెట్టు ఇలా కొమ్ము పురుగు సోకి పూర్తిగా నిర్వీర్యమైంది. తెగుళ్ల నివారణ ఎలా చేపట్టాలో.. మిగతా మొక్కలకు పురుగు సోక కుండా ఎలాంటి యాజమాన్య పద్ధతులు పాటించాలో తెలియక ఆ రైతు ఆందోళన చెందుతున్నాడు. తెగుళ్ల బారిన పడి కొబ్బరిచెట్లు పాడైపోతున్నా.. ఉద్యానశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నాడు.



కొబ్బరి పంటను ధ్వంసం చేస్తున్న కొమ్ము పురుగులు ఇవే..

రణస్థలం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):

రణస్థలం మండలం మెట్ట ప్రాంతాల్లోని తోటల్లో వందలాది కొబ్బరి చెట్లు తెగుళ్లతో నాశనం అవుతున్నాయి. ఎర్ర నల్లి, కొమ్ము పురుగు సోకి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగుల్చుతున్నాయి. కనీస స్థాయిలో ఉద్యాన శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. సమాచారం ఇచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారని వాపోతున్నారు. జిల్లాలో లక్ష ఎకరాలకుపైగా ఉద్యాన పంటలు సాగవుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. 1.5 లక్షల మంది రైతు కుటుంబాలు ప్రత్యక్షంగా, మరో 2 లక్షల మంది కూలీలు, ఇతర వర్గాలు పరోక్షంగా జీవనోపాధి పొందుతున్నారు. జీడితోటలు 51,200 ఎకరాలు, కొబ్బరి 32,300 ఎకరాలు, మామిడి 5,200 ఎకరాలు, అరటి 6,500 ఎకరాలు, కూరగాయలు 5000 ఎకరాలు, ఇతర పంటలు 20,000 ఎకరాల్లో సాగవుతున్నాయి. ప్రధానంగా జిల్లాలో కొబ్బరికి గానోడెర్మా తెగులు సోకుతోంది. చాలా ప్రాంతాల్లో ఎకరా తోటలో 5 నుంచి 10 చెట్లు వరకూ ఈ తెగుళ్లతో నాశనం అవుతున్నాయి. దీంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఇప్పటికే హుద్‌హుద్, తితలీ తుఫాన్లతో కొబ్బరి పంటకు చాలా నష్టం జరిగింది. తాజాగా తెగుళ్ల బెడద వెంటాడుతోంది. జీడి పంటదీ అదే పరిస్థితి. ఏటా శీతాకాలంలో జీడిపూత వస్తుంది. ఆ సమయంలో మంచు కారణంగా టీ దోమ వంటివి సోకుతున్నాయి. పూత దశలో పంటకు నష్టం వాటిల్లుతోంది. కాగా తెగుళ్ల నివారణకు (మిగతా 6వ పేజీలో..)

సిబ్బంది జాడే తెలియదు..

రణస్థలం మండలంలోని ఉద్యాన శాఖ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియదు. కొమ్ముపురుగు సోకి మూడేళ్లుగా కొబ్బరి చెట్లు నేలకొరుగుతున్నాయి. వీటి నివారణకు సలహా ఇచ్చే అధికారి కానరావడం లేదు. కొబ్బరి రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలి.

-శ్రీనివాసరావు, కృష్ణాపురం, కొబ్బరి రైతు

ప్రభుత్వ పథకాలు తెలియవు..

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు తెలియడం లేదు. మెంటాడ రెవెన్యూ పరిధిలో 15 ఎకరాల కొబ్బరి సాగు చేస్తున్నాను. కొబ్బరి దిగుబడి తగ్గింది. ఎర్ర నల్లి, కొమ్ము పురుగు వలన కొబ్బరి చెట్లు ధ్వంసమవుతున్నాయి. కొబ్బరి పూత నిలబడడం లేదు. దీనికి సంబంధించిన అధికారులు కనీసం సలహాలు ఇవ్వడం లేదు. ఉద్యాన అధికారుల జాడే లేదు.

-ఆర్.సూర్యనారాయణరెడ్డి, కొబ్బరి రైతు, మెంటాడ

రెట్టింపు ఆదాయమే లక్ష్యం..

అన్నదాతకు ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యంగా ఉద్యాన శాఖ పనిచేస్తోంది. జిల్లాలో సిబ్బంది కొరత ఉన్నా.. వీలైనంత వరకు మెరుగైన సేవలందిస్తున్నాం. ప్రత్యేకంగా పథకాలు సైతం అమలు చేస్తున్నాం. కొబ్బరిలో కొమ్ము పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలు వాడితే మంచి ఫలితం లభిస్తుంది.

-రత్నాల వరప్రసాద్, జిల్లా ఉద్యానశాఖ అధికారి, శ్రీకాకుళం



వందేమాతరం గీతాలాపన చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, తదితరులు

వందేమాతరం గొప్పతనం భావితరాలకు తెలియాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతం గొప్పతనం భావితరాలకు తెలియజేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మన జాతీయ గీతం 'వందేమాతరం' 150 సంవత్సరాల సంస్మరణోత్సవం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సామూహిక గాన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ '1875లో బంకించంద్ర ఛటర్జీ బెంగాలీలో రచించిన వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్యోద్యమంలో చాలా ప్రాచుర్యం పొందింది. 1950వ సంవత్సరంలో దీనిని జాతీయగీతంగా స్వీకరించారు. ప్రజల్లో గొప్ప ప్రేరణ నింపిన ఈ గీతం యొక్క ప్రాధాన్యం భావితరాలకు చాటిచెప్పాల'ని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, ఇన్‌చార్జి డీఆర్వో లక్ష్మణ మూర్తి, బీసీ వెల్ఫేర్ అధికారి అనూరాధ, విశ్రాంత డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, కలెక్టరేట్ ఏఓ జీఏ సూర్యనారాయణ, విభాగాల పర్యవేక్షకులు సురేష్, రాజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



బాలియాత్ర కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

నదిలో తెప్పలు విడిచిపెట్టొద్దు

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి
- ఏ ఘటన జరిగినా కమిటీ సభ్యులదే బాధ్యత
- ఎస్పీ మహేశ్వరరెడ్డి

6లో

'మహేంద్రతనయ'ను పూర్తిచేయాలి

- రిజర్వాయర్ పనుల్లో జాప్యానికి వీల్లేదు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మహేంద్రతనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రాజెక్టు పురోగతిపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. మెళియాపుట్టి, పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం తదితర మండలాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టు పనులకు ప్రధాన అడ్డంకిగా భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. భూసేకరణ, ఇతర పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు దాదాపు రూ.16.20కోట్లు విడుదల చేయడానికి భూసేకరణ విభాగం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. పునరావాసం, పునర్నిర్మాణ ప్యాకేజీల కోసం అదనంగా రూ.24.50కోట్లు అవసరమని అధికారులు తెలిపారు. ఈ నిధులకు సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్ ఆదేశించారు. పలాస -పర్లాకిమిడి డైవర్షన్ రోడ్డుకు సంబంధించిన భూసేకరణ దాదాపు పూర్తయ్యిందని, అర్హులకు చెల్లింపులను వేగవంతం చేయాలన్నారు. ఇతర పనులు, సమస్యలకు సంబంధించిన నివేదికలను టెక్కలి ఆర్డీవో, తహశీల్దార్లు త్వరగా సమర్పించాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరగడానికి వీల్లేదని, రైతులకు సాగునీరు, పలాస-కాశీబుగ్గ పట్టణానికి తాగునీరు సకాలంలో అందేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో ఎస్.వెంకటేష్, ఇన్‌చార్జి డీఆర్వో లక్ష్మణమూర్తి, ఉప కలెక్టర్ జయదేవి, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, వంశధార ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



బొమ్మ వేసి బోధిస్తున్న అప్పలరాజు మాస్టార్

బొమ్మలే.. బోధనాస్త్రాలు

- బహుముఖ ప్రజ్ఞాశాలి అప్పలరాజు మాస్టార్
- మూడుసార్లు రాష్ట్రస్థాయి అవార్డులు
- వినూత్న బోధనతో ఉత్తమ ఫలితాలు
- మంత్రి నారా లోకేష్‌చే ప్రశంసలు

బల్లెడ అప్పలరాజు మాస్టార్ మీ కళాత్మక బోధనాశైలి చూడముచ్చటగా ఉంది. పాతపట్నంలోని ఏపీ మోడల్ పాఠశాలలో బోటనీ సబ్జెక్ట్ బోధిస్తూనే.. సహ ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారంతో ల్యాబ్‌ను ఆకర్షణీయంగా, విజ్ఞానవతంగా తీర్చిదిద్దిన తీరు స్ఫూర్తినిస్తోంది. సైన్స్, మోరల్ వాల్యూస్, జనరల్ నాలెడ్జ్ ప్రతిబింబించేలా ల్యాబ్‌ను ఆర్టిస్టిక్‌గా రూపొందించి, నిర్వహిస్తున్న తీరు అభినందనీయం.

-ఇదీ ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన ట్విట్టర్, ఫేస్‌బుక్‌లో అప్పలరాజు మాస్టారుపై పెట్టిన ప్రశంసల పోస్టు

పాతపట్నం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):

ఆ మాస్టార్ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన వేసే ఆకర్షణీయ బొమ్మలే బోధనాస్త్రాలు. ఆయన ఏ స్కూల్‌లో పనిచేస్తే.. అక్కడ పాఠశాల ఆవరణ అంతా మొక్కల పచ్చదనంతో నిండి ఆహ్లాదంగా మారిపోతుంది. విద్యార్థుల్లో దేశభక్తి నింపేలా నినాదాలు కనిపిస్తాయి. ల్యాబ్‌లు, గ్రంథాలయాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్ది విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంచుతారు. పుస్తకాల్లో ఉన్నది చెప్పడం కాదు. తానే స్వయంగా బొమ్మలు వేసి.. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో వాటిని బోధిస్తారు. ఇదీ పాతపట్నం ఏపీ మోడల్ స్కూల్‌లో బయాలజీ ఉపాధ్యాయుడు బల్లెడ అప్పలరాజు మాస్టార్ ప్రత్యేకత. లఘు చిత్రాలు కూడా రూపొందించడం ఆయనకున్న మరో విశిష్టత. ఆయన ప్రతిభకు ఇప్పటికే మూడుసార్లు రాష్ట్రస్థాయి అవార్డులు దక్కగా.. తాజాగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నుంచి ప్రశంసలు దక్కడం మరోసారి చర్చనీయాంశమవుతోంది.

- అప్పలరాజు మాస్టారు 2013 నుంచి 2017 వరకు జి.సిగడాంలో ఆదర్శ పాఠశాలలో పనిచేశారు. తర్వాత 2017 నుంచి 2022 వరకు రాజాం సమీపాన పెరుమాళలో విధులు నిర్వర్తించారు. 2022 నుంచి పాతపట్నం ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్నారు. ఈయన పనిచేసే ప్రతి చోటా వినూత్న బోధన సాగిస్తున్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచి.. పచ్చదనం నింపేలా కృషి చేశారు. పాఠశాలల గోడలపై దేశభక్తి నినాదాలు రాయించి విద్యార్థుల్లో దేశభక్తిని నింపారు. పాఠశాలలోని గ్రంథాలయాలు, ఇంగ్లిష్ తదితర ల్యాబ్‌ల్లో వివిధ పితామహులు, శాస్త్రవేత్తల చిత్రాలను, మొక్కల యొక్క హెర్బేరియంలను ఆకర్షణీయంగా అలంకరించి విద్యార్థులకు ఉప యోగపడేలా తీర్చిదిద్దారు. అందుకే ఆయన పనిచేసే ప్రతి పాఠశాలలోనూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ.. ఇది అప్పలరాజు మాస్టార్ బ్రాండ్ స్కూల్ అని ముద్రవేస్తారు.

మూడుసార్లు రాష్ట్రస్థాయి అవార్డులు..

రాష్ట్ర ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (విజయవాడ) సంస్థ ఏటా డిసెంబరు 14 నుంచి 20 వరకు (మిగతా 6వ పేజీలో..)



పాతపట్నం ఆదర్శ పాఠశాలలో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ప్రయోగశాల

పిలిచారు.. ఎత్తుకెళ్లారు!

- సీసీ ఫుటేజీలో రికార్డయిన వ్యాపారి కిడ్నాప్ వ్యవహారం
- ఐదుగురిపై కేసు నమోదు
- మరో ముగ్గురి ప్రమేయంపై పోలీసుల ఆరా

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు

- ఎమ్మెల్యే గొండు శంకర్
- ఘనంగా జిల్లాస్థాయి స్కిల్ పోటీలు

6లో



7లో

ఎచ్చెర్ల ఎంపీపీగా విజయకుమారి బాధ్యతల స్వీకరణ

కంపుకొడుతున్న జిల్లా కేంద్రాసుపత్రి

- కానరాని వసతులు
- మంత్రి చెప్పినా పట్టని వైనం

8లో



ఇటీవల తుఫాన్ ప్రభావానికి పెద్ద గణగళ్లవానిపేట తీరంలో కొట్టుకుపోయిన పబ్లిక్ టాయిలెట్స్

తీరం.. అధ్వానం

- పెద్దగణగళ్లవానిపేటలో కోతకు గురైన వైనం
- ఇసుక బస్తాలతో రక్షణ చర్యలు

శ్రీకాకుళం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో శ్రీకాకుళం మండలం పెద్దగణగళ్లవానిపేట తీరం అస్తవ్యస్తంగా మారింది. ఒకప్పుడు పర్యాటకులతో సందడిగా కళకళలాడిన ఈ బీచ్ ప్రస్తుతం అధ్వానంగా కనిపిస్తోంది. తుఫాన్ సమయంలో అలల ఉధృతితో తీరప్రాంతం కోతకు గురైంది. పబ్లిక్ టాయిలెట్లు, రోడ్లు ధ్వంసమయ్యాయి. సరుగుడు చెట్లు నేలకొరిగాయి. బీచ్‌కు ఒకపక్కన ఉన్న రహదారి కోతకు గురై రవాణాకు అంతరాయం ఏర్పడింది. తుఫాన్‌ల సమయంలో గాలి ప్రభావం పెరుగుతోందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కోతకు గురైన చోట.. అధికారులు, గ్రామస్థులు కలిసి ఇసుకబస్తాలు వేసి.. తాత్కాలిక రక్షణ చర్యలు చేపడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి తీరం కోతకు గురికాకుండా శాశ్వత పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



మొంథా తుఫాన్‌కు ముందు పబ్లిక్ టాయిలెట్స్ ఇలా..



తీరంలో నేలకొరిగిన చెట్లు



కోతకు గురైన ప్రాంతంలో ఇసుక బస్తాలు వేస్తున్న దృశ్యం



డీఎంహెచ్‌వో అనిత ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

స్క్రీనింగ్ పరీక్షతో క్యాన్సర్‌పై విజయం


- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డా.అనిత

అరసవల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్క్రీనింగ్ పరీక్ష చేయించుకుని, తొలిదశలోనే గుర్తించడం ద్వారా క్యాన్సర్‌పై విజయం సాధించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.అనిత తెలిపారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద వైద్య ఆరోగ్యశాఖ, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన క్యాన్సర్ అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'క్యాన్సర్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రపంచంలో అధిక మరణాలు గుండె జబ్బులు ద్వారా సంభవిస్తే, క్యాన్సర్ వ్యాధి మరణాలు రెండో స్థానంలో ఉన్నాయి. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే వైద్యారోగ్యశాఖ సిబ్బంది వచ్చి క్యాన్సర్ (మిగతా 8వ పేజీలో..)

ఘనంగా వందేమాతరం వేడుక

వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, సంస్థల వద్ద ఘనంగా వేడుకలను నిర్వహించారు. వందే మాతరం విశిష్టతను వక్తలు వివరించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



సోంపేట: భారత చిత్రపటం ఆకారంలో కూర్చున్న విద్యార్థులు



లావేరు: జడ్పీ స్కూల్ ఆవరణలో వందేమాతరం ఆలపిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు



సంతబొమ్మాళి: దండుగోపాలపురంలో వందేమాతం అక్షరమాలలో విద్యార్థులు



శ్రీకాకుళం క్రైం : ఎస్పీ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న దృశ్యం



నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ప్రదర్శన..



కంచిలి: మఖరాంపురం 150 అక్షరాకృతిలో..



ఎచ్చెర్ల: బీఆర్ఏయూలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని



పోలాకి: మబగాం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన



నందిగాం: లఖిదాసుపురం ఉన్నత పాఠశాలలో భారీ జాతీయ జెండా ఎదుట వందేమాతరం గీతాలాపన చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



వజ్రపుకొత్తూరు: కంబాలరాయుడు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

పిలిచారు.. ఎత్తుకెళ్లారు!

- సీసీ ఫుటేజీలో రికార్డయిన వ్యాపారి కిడ్నాప్ వ్యవహారం
- ఐదుగురిపై కేసు నమోదు
- మరో ముగ్గురి ప్రమేయంపై పోలీసుల ఆరా

పలాస, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పలాస జీడి వ్యాపారి, బ్యాంకుల కన్సల్టెంట్ వైశ్యరాజు లక్ష్మీనారాయణ రాజు కిడ్నాప్ వ్యవహారం జిల్లాలో సంచలనం కలిగించిన విషయం విదితమే. కేటీ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న టీ స్టాల్ వద్ద సీసీ కెమెరాలో ఈ వ్యవహారం రికార్డు అయింది. ఇద్దరు వ్యక్తులు షాపులోకి వచ్చి టీ తాగుతున్న వీఎల్ఎన్ రాజుతో తొలుత నెమ్మదిగా మాట్లాడారు. తర్వాత వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం కారు వద్దకు రావాలని బలవంతంగా వారిద్దరూ రాజు చేతులు పట్టుకుని తీసుకుని వెళ్లడం కనిపించింది. ఇది ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నిత్యమూ రద్దీగా ఉండే ప్రాంతంలోనే కిడ్నాప్ చేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. వీఎల్ఎన్ రాజు స్వగ్రామం ఆమదాలవలస. పలాసకు చెందిన మాధవితో వివాహమైన నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నారు. రాజు కొద్ది రోజులు జీడి వ్యాపారం, ప్రస్తుతం బ్యాంకులకు కన్సల్టెన్సీగా వ్యవహరిస్తున్నారు. ఆమదాలవలస పట్టణంలో ఆయనకు ఉన్న ఓ స్థలానికి సంబంధించి జరిగిన ఘర్షణ కిడ్నాప్ వరకూ తీసుకువచ్చింది. పొట్నూరు వేణుగోపాలరావు నుంచి రాజు కొంత మొత్తాన్ని తీసుకుని తన స్థలాన్ని బోగబంద (అద్దె లేకుండా నగదు తీసుకునే విధానం)కు ఇచ్చినట్టు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో ఆ స్థలాన్ని రాజు విక్రయించేందు సిద్ధమవ్వగా.. తనకే అమ్మాలంటూ వేణుగోపాలరావు పట్టుబడుతున్నాడు. ఈ వ్యవహారంపై వీరిమధ్య కొన్నాళ్లగా ఘర్షణ కొనసాగుతుంది. ఈ క్రమంలో రాజును కిడ్నాప్ చేసి ఆ స్థలాన్ని తన పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వేణుగోపాలరావు ప్లాన్ చేసుకున్నాడు. దీంతో తనకు తెలిసిన ఏడుగురిని పురమాయించి రెండు కార్లతో గురువారం పలాస-కాశీబుగ్గ చేరుకున్నారు. టీ తాగుతున్న రాజుతో మాట్లాడి.. బలవంతంగా ఓ కారులోకి ఎక్కించి తీసుకెళ్లిపోయారు. విషయం పోలీసులకు తెలియడం.. వారు వేణుగోపాలరావును హెచ్చరించడంతో అతడి ప్లానంతా బెడిసికొట్టింది. కిడ్నాప్ చేసిన క్రమంలో వీఎల్ఎన్ రాజుపై భౌతికంగా దాడి జరగడంపై స్థానికంగా ఆందోళన నెలకొంది. వ్యాపారులకు స్వర్గధామమైన పలాస-కాశీబుగ్గలో ఇటువంటి ఘటనలు మునుపెన్నడూ జరగలేదు. వ్యాపారులపై భౌతిక దాడులకు దిగితే తమ పరిస్థితి ఏమిటనే పలువురు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ మాట్లాడుతూ.. కిడ్నాప్‌కు పాల్పడిన పొట్నూరు వేణుగోపాలరావు, బొడ్డేపల్లి శ్రీనివాసరావుతో పాటు ఐదుగురిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ వ్యవహారంలో మరో ముగ్గురి ప్రమేయం ఉన్నట్టు తెలుస్తుందని, దీనిపై ఆరా తీస్తున్నట్టు తెలిపారు.



రాజును కిడ్నాపర్లు బలవంతంగా తీసుకెళ్తున్నట్టు సీసీ ఫుటేజీలో రికార్డయిన దృశ్యం

నదిలో తెప్పలు విడిచిపెట్టొద్దు

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి
- ఏ ఘటన జరిగినా కమిటీదే బాధ్యత
- ఎస్పీ మహేశ్వరరెడ్డి

జలుమూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలో ఈనెల 9న నిర్వహించనున్న బాలియాత్రకు సంబంధించి వంశధార నదిలో తెప్పలతో దీపాలు విడచిపెట్టడానికి ఎటువంటి అనుమతులు లేవని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష కమిటీ సభ్యులకు సూచించారు. శ్రీముఖలింగం వద్ద వంశధార నది తీరం, తీర్థ ఘాట్ రేవులను, ఆలయ పరిసరాలను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వంశధారనదిలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్నందున, స్నానాల రేవు ఘట్టం లోతుగా ఉన్నందున నదిలో తెప్పలు విడచిపెట్టడానికి భక్తులకు అనుమతి ఇస్తే ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. అందుకే భక్తుల మనోభావాలు దెబ్బదినకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఒక వేళ తెప్పోత్సవం నదిలో జరిగితే ఏమైనా ఘటనలు సంభవిస్తే కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. బాలియాత్ర మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నదిలోకి భక్తులు వెళ్లి వచ్చే మార్గాలు వేర్వేరుగా ఉండాలన్నారు. నదిలో తెప్పలు విడచిపెట్టడానికి ప్రత్యామ్నాయంగా డ్రమ్ముల్లో నీరుపోసి తెప్పలు విడిచిపెట్టుకోవాలని సూచించారు. టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు, నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు, జలుమూరు ఎస్ఐ బి.అశోక్‌బాబు, తహసీల్దార్ జె.రామారావు, ఆలయ ఈవో ఏడుకొండలు, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, జలుమూరు ఏఎంసీ చైర్మన్ తర్ర బలరాం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వంశధార నదిలో స్నానాల రేవు మార్గాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి తదితరులు

కొబ్బరికి కష్టమొచ్చింది

(ఐదో పేజీ తరువాయి)

పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులపై సూచనలు చేయాల్సిన ఉద్యానశాఖ అధికారుల జాడ లేకుండా పోతోంది. సాగు సలహాలు, సూచనల విషయంలో అధికారులు ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రైతులకు అధికారుల నుంచి ప్రోత్సాహం కరువవుతుందనే ఆరోపణలున్నాయి. సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కేంద్ర ఆయిల్‌పామ్ మిషన్, జాతీయ వెదురు మిషన్ వంటి పథకాలు ఉన్నా.. వాటిపై ఉద్యానశాఖ అధికారులు అవగాహన కల్పించిన దాఖలాలు లేవని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి.. కొబ్బరికి తెగుళ్ల నివారణపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బొమ్మలే.. బోధనాస్త్రాలు

(ఐదో పేజీ తరువాయి)

ఎనర్జీ వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో వరుసగా మూడుసార్లు తానుతీసిన లఘు చిత్రాలకు అప్పలరాజు మాస్టారు రాష్ట్రస్థాయి అవార్డులు పొందారు. ఎనర్జీ కన్జర్వేషన్ ప్రధానాంశంగా-1,2,3 చిత్రాలు ఏటా రాష్ట్రస్థాయి గుర్తింపునిస్తూనే ఉన్నాయి. ఒకప్పటి జెన్‌కో ఎమ్‌డీ, ప్రస్తుత చీఫ్ సెక్రటరీ విజయానంద్ చేతులమీదుగా 2022లో ప్రథమ బహుమతిగా రూ.20వేలు, 2023లో తృతీయ బహుమతి రూ5వేలు, 2024లో కన్సోలేషన్ బహుమతిగా రూ.2వేలు నగదు ప్రోత్సాహకం పొందారు.

- శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో గతేడాది సెప్టెంబరు 5న కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతులమీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు.
- ఈ ఏడాది రాష్ట్ర బెస్ట్ పెర్ఫార్మెన్స్ టీచర్‌గా రాష్ట్ర ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరావు చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.
- తాజాగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా సామాజిక మాధ్యమాల వేదికగా అభినందిచడం ఆనందంగా ఉందని అప్పలరాజు మాస్టార్ తెలిపారు. ఇదే స్ఫూర్తితో బోధన సాగిస్తూ.. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తానని వెల్లడించారు.

'మన మిత్ర'పై ఇంటింటా అవగాహన

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మనమిత్ర వాట్సాప్ (వాట్సాప్ గవర్నెన్స్)పై ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన అరసవల్లిలోని వెలమవీధిలో గల సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మనమిత్ర వాట్సాప్ ద్వారా రిజిస్ట్రేషన్, ఆస్తిపన్ను, విద్యుత్తు బిల్లులు, భూములకు సంబంధించి 1బిలు వస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఓ రైతు తన భూమి రీసర్వేలో మూడు ఖాతాల్లో ఉందని తెలుపగా... పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూములపై రీసర్వే జరుగుతోందని, త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో రీసర్వే చేస్తారని తెలిపారు. ప్రజలు తమ ఫోన్ ద్వారానే మనమిత్ర యాప్ ద్వారా ఆస్తిపన్ను, విద్యుత్తు బిల్లులు చెల్లించవచ్చని, సర్టిఫికెట్లు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అందరికీ న్యాయం అందేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఒకటో అదనపు జిల్లా న్యాయాధికారి భాస్కరరావు

శ్రీకాకుళం లీగల్, నవంబరు07 (ఆంధ్రజ్యోతి): అందరికీ సమన్యాయం అందేలా ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని ఒకటో అదనపు జిల్లా న్యాయాధికారి పి.భాస్కరరావు అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా స్థానిక న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చట్టంపై సరైన అవగాహన లేకపోవడంతో పెండింగ్ కేసుల సంఖ్య పెరుగుతోందని అన్నారు. పేద వారు, నిరక్ష్యరాస్యులు, బలహీన వర్గాలకు న్యాయ సహాయం అందించడానికే న్యాయసేవాధికార సంస్థ ఆవిర్భవించినట్లు తెలిపారు. మూడో అదనపు జిల్లా న్యాయాధికారి సీహెచ్ వివేకానంద శ్రీనివాస్, పోక్సో కోర్టు న్యాయమూర్తి నక్క సుజాత, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.శ్రీధర్, అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.శాంతిశ్రీ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.అనురాగ్, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తంగి శివప్రసాద్, కార్యదర్శి పిట్టా దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా న్యాయ సేవల దినోత్సవం..

సోంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో మండల న్యాయసేవా సంఘ అధ్యక్షుడు, ఆరో అదనపు జిల్లా న్యాయాధికారి కె.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయ సేవల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో కిషోర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులలో ఎల్లప్పుడూ పోటీతత్వం ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.పుష్పాంజలి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్ శైలేంద్ర, న్యాయవాదులు ఎం.సర్వేశ్వరరావు, జి.పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న న్యాయాధికారి కిషోర్‌బాబు

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు

- ఎమ్మెల్యే గొండు శంకర్

పాత శ్రీకాకుళం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అమలు చేస్తున్న నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు, వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్కి ల్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. దేశంలో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల స్థాయి నుంచి వివిధ రకాల స్కిల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. కస్తూరీబా గాంధీ పాఠ శాలలు జిల్లాలో రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయని ప్రశంసించా రు. అనంతరం విద్యార్థులు స్వయంగా తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ ఎస్.శశిభూషణ్‌రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్







విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు

ఎచ్చెర్లలో ఉత్సాహంగా ఐక్యతా ర్యాలీ

ఎచ్చెర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలో ఐక్యతా ర్యాలీని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, మేరా యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ ఉజ్వల్, కూటమి నేతలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, శ్రీ శివానీ, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు చిలకపాలెం నుంచి ఎచ్చెర్ల మీదుగా కేశవరెడ్డి స్కూల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేశవరెడ్డి స్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ దేశాభివృద్ధి కోసం అంతా ఐక్యంగా మందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, మండల టీడీపీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తదితరులు

అభివృద్ధి పనులు వేగవంతం చేస్తాం



శ్రీకాకుళం రూరల్: బగ్గువానిపేట వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్/అరసవల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సింగుపురం పంచాయితీలోని బగ్గువానిపేటలో నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు రూ.12లక్షల వ్యయంతో రోడ్డు నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.ప్రకాష్‌రావు, సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు, కుంచాల ఆదినారాయణ, అల్లు తారక్, పంగ రమేష్, చింతు హిమగిరి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. శ్రీకాకుళంలోని విశాఖ-ఏ కాలనీలో గల తన కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం ఎర్రన్న విద్యాసంకల్పంలో భాగంగా స్థానిక కె.ఆర్.స్టేడియం వద్ద గల ఎర్రన్నాయుడు స్టడీ సర్కిల్‌లో ఆర్‌ఆర్‌బీ, గ్రూప్-డి ఉద్యోగాలకు శిక్షణ తీసుకున్న అభ్యర్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలల విద్యార్థినులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఆ విద్యార్థినులు రెయ్యి మోనిక, విజయలక్ష్మి నాయకోను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనువాసరావు, ప్రిన్సిపాల్ నవ్యశ్రీ అభినందించారు. కాదా లక్ష్మీకాంతమ్మ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన జి.చందన, జి.యామినిశ్రీ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం తెలిపారు. ఈ విద్యార్థినులను వీరు అభినందించారు.

పనిచేయని అధికారులెవరైనా నిలదీస్తా: ఎమ్మెల్యే

పొందూరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): 'అధికారులు బాధ్యతతో పని చేయాలి.. అహం కారంతో కాదు. పనిచేయని అధికారులెవరైనా నేను నిలదీస్తా'నని పీయూ సీ చైర్మన్ ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పొందూరు మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల సమావేశాలను అధికారులు చులకనగా చూడరాదని... తప్పనిసరిగా హాజరవ్వాలని అన్నారు. సీఎస్‌డీటీ మధుబాబు సమావేశానికి రాకపోవడంపై మండి పడ్డారు. భూమిలేని కొందరు యూరియాను తీసుకుని బ్లాక్‌లో అమ్ముకోవడంతో నిజమైన రైతులకు అన్యాయం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా మనకు వచ్చిన యూరియాను కొందరు ఇతర నియోజకవర్గాలకు తరలించడం కూడా తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. మొంథా తుపానుతో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినా ఎవరూ నమోదు చేయలేదని పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీని పై ఆ శాఖకు సంబంధించిన అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జలజీవన్ మిషన్ పనుల్లో భాగంగా పైపులు వేసేందుకు సిమెంట్ రోడ్లను తవ్వేసి వదిలివేయడంతో సంబంధిత అధికారులను సభ్యులు నిలదీశారు. ధర్మవరంలో తామే సిమెంట్ రహదారి పై గోతులు పూడ్చుకున్నామని ఎంపీటీసీ అన్నెపు కుమారి తెలిపారు. నియోజకవర్గంలో రహదారులపై ఆక్రమణలు తొలగించేటప్పుడు పార్టీ నాయకులు ఎవరూ కలుగజేసుకోరాదని చెప్పానని ఎమ్మెల్యే అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు వైస్ ఎంపీపీ శ్రీదేవి, పీఏసీఎస్ అధ్యక్షులు వండాన మురళి, మాజీ ఎంపీపీ కూన ప్రమీల, డిప్యూటీ ఎంపీడీవో సింహచలం, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు

ఆమదాలవలస, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించే ఆర్థిక సాయం వరంగా మారుతోందని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం శ్రీకాకుళంలోని తన స్వగృహం వద్ద సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎల్లువాడ పుష్పకు రూ.1.25 లక్షలు, గండుపల్లి లక్ష్మీభవానీకి రూ.3.90 లక్షలు, బొడ్డేపల్లి పట్టాభి కుటుంబానికి రూ.65 వేల వంతున అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాలు, వైద్య అవసరాల్లో కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని ఎన్నో కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక భరోసా కల్పించామని అన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

ఆమదాలవలస, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై అర్జీల ను సమర్పిస్తే పరిష్కారానికి ఎమ్మెల్యే రవికుమార్ తగిన చర్యలు తీసుకుంటారన్నారు. ఈ వినతుల స్వీకరణ కార్యక్రమంలో కొర్లకోట ఎంపీటీసీ సభ్యుడు అన్నెపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కలిశెట్టికి జన్మదిన శుభాకాంక్షలు

అరసవల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విజయనగరం పార్ల మెంటు సభ్యుడు కలిశెట్టి అప్పల నాయుడుకి ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాసరావు శుక్ర వారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీతో కలిసి శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్నారు.



ఎంపీ కలిశెట్టితో శ్రీనివాసరావు

ఘనంగా సీవీ రామన్ జయంతి

ఆమదాలవలస, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ప్రతిష్టను ఇనుమడింపజేసిన గొప్ప శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్, నోబెల్ బహుమతి గ్రహీత పొందిన మేడమ్ మేరీ క్యూరీ జయంతి వేడుకలు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు పైల రవికుమార్, జనవిజ్ఞాన వేదిక రా ష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, స్టాఫ్ సెక్రటరీ పి.రామస్వామినాయుడు, ఉపాధ్యాయులు జి.అప్పారావు, పి.మోహన్‌రావు, ఎం.వి.ఆర్.భట్లు, కోట కోటేశ్వరరావు, ఎస్.సులోచనారాణి, షేక్‌షావలి, టి.సి.హెచ్.మనోహర్, ఎస్.అరుణ, బి.శరత్‌కుమారి, ఎం.ఉమాకుమారి, శివరాజ్, కుమారి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు

ఇచ్ఛాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాహుదా నది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ ఎన్.వెంకటరావు అన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. నదిలో వంతెనకు 500మీటర్లు లోప ఇరుపక్కల బోర్డులు ఏర్పాటు చేశారు. ఇకపై అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి

సోంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంటి రాజేశ్వరరావు ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలని సీపీఎం మండల కార్యదర్శి సంగారు లక్ష్మినారాయణ కోరారు. బారువలో గంటి రాజేశ్వరరావు వర్థంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహంతోపాటు పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జుత్తు సింహాచలం, దున్న యామయ్య, చిరంజీవి, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికల క్రికెట్ పోటీల విజేత అనంతపురం



బహుమతి అందుకుంటున్న అనంతపురం క్రీడాకారిణులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ బాలికల క్రికెట్ టోర్నమెంట్‌లో అనంతపురం బాలికలు విజేతలుగా నిలిచారు. ద్వితీయ స్థానంలో తూర్పుగోదావరి, తృతీయ స్థానంలో విజయనగరం జట్టు నిలిచాయి. స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న 69వ అంతర్ జిల్లాల అండర్-19 బాలికల క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ హోరాహోరీ పోరులో 10 పరుగుల తేడాతో తూర్పుగోదావరి జట్టుపై అనంతపురం జట్టు విజయం సాధించింది. బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో ప్రతిభ కనబర్చిన అనంతపురం కెప్టెన్ అన్ను రెడ్డి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన తూగోదావరి జట్టు 58 పరుగులు మాత్రమే చేసింది. విజేతలకు రాష్ట్ర పరిశీలకులు రాజేష్ అగోలా, జిల్లా ఒలింపిక్ సంఘం సలహాదారు పి.సుందరరావు, కార్యదర్శి పి.సాంబమూర్తి, జిల్లా పీఈటీ, పీడీల సంఘం కార్యదర్శి ఎం.వి.రమణ, జిల్లా ఎస్.జి.ఎఫ్. కార్యదర్శులు బి.వి.రమణ, స్వాతి, గ్రిగ్స్ సెక్రటరీ టి.శ్రీనివాసరావు తదితరులు బహుమతులు అందజేశారు.

విజేతలుగా తిరిగి రావాలని..

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లిలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విజేతలుగా తిరిగి రావాలని రా ష్ట్ర కార్యదర్శి, ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత డా. సూర శ్రీనివాసరావు ఆకాంక్షించారు. స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా శు క్రవారం పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు క్రీడాసామగ్రి, స్పోర్ట్స్ యూనిఫాం తదితర వస్తువులను ఆయన అందజేశారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం కన్వీనర్ ఎం.వి.రమణ, జిల్లా ఒలింపిక్ సంఘం సలహాదారు పి.సుందరరావు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు ప్రభుత్వం చేయూత

లావేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతకు ఎంతగానో చేయూతనిస్తున్నాయని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన లావేరు, అప్పాపురం, కుంకాం గ్రామాల్లో గల 247 చేనేత కార్మిక కుటుంబాలకు 50 కేజీల వంతున బియ్యంతో పాటు మరో 5 రకాల నిత్యావసర సరుకులను శుక్రవారం ఎమ్మెల్యే అందజేశారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొఠారి గ్రామానికి చెందిన చిన్నారి దియా అనారోగ్యంతో బాధ పడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు సావాడ గణేష్‌రెడ్డి, అతని స్నేహితులు, మరికొంతమంది దాతలు సాయానికి ముందుకువచ్చారు. ఈ చిన్నారి కుటుంబానికి శుక్రవారం రూ55,555 నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుక్క ఆనంద్, ఎం.యాదవ్‌రెడ్డి, శ్రీరాం, చిన్నయ్య, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల ఎంపీపీగా విజయ కుమారి బాధ్యతల స్వీకరణ

ఎచ్చెర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండల పరిషత్ అధ్యక్షురాలిగా వైస్ ఎంపీపీ -2 జరుగుళ్ల విజయకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంపీపీగా ఉన్న మొదలవలస చిరంజీవి పీడీ యాక్ట్‌లో అరెస్టయి విశాఖపట్నం సెంట్రల్ జైలులో ఉండడంతో... విజయకుమారికి ఎంపీపీగా నియమిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి సహకారంతో రాజకీయాలకు అతీతంగా మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.హరిహరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరావు, మండల వైసీపీ అధ్యక్షుడు బోర సాయిరాం, ఏఎంసీ మాజీ చైర్మన్ జీరు రామారావు తదితరులు పాల్గొన్నారు.

కులాలకు అతీతంగా బాలియాత్ర

ఆమదాలవలస, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగం ప్రాంతంలో నిర్వహించే బాలియాత్రలో కులాలకు అతీతంగా అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కాం గ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు అన్నారు. శుక్రవారం కొర్లకోట గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వేల సంవత్సరాల కళింగ ప్రజల నౌకాయానమే బాలియాత్రగా ప్రసిద్ధి చెందిందని ఆయన తెలిపారు. ఈ నెల 9న శ్రీముఖలింగం పుణ్య క్షే త్రంలో నిర్వహించే బాలియాత్ర పూజా కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

హెర్బల్ గార్డెన్‌కు స్థల పరిశీలన

ఎచ్చెర్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో 10 హెక్టార్లలో హెర్బల్ గార్డెన్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు అధికారులు శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు సీఈవో ఎ.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఔషధ మొక్కల సాగుతో భావితరాలకు కాలుష్యరహిత సమాజాన్ని అందజేస్తామన్నారు. గంజాయి సాగు, వినియోగానికి యువత దూరంగా ఉండాలన్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి కె.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఔషధ రంగ విద్యాభ్యసనలో స్వల్పకాలిక కోర్సులు పూర్తి చేస్తే మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ వర్సిటీలో హెర్బల్ గార్డెన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, పూర్వపు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, అకడమిక్ డీన్ డాక్టర్ కె.స్వప్నవాహిని, ఆర్ అండ్ డీ డీన్ డాక్టర్ ఎస్.లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సుడిదోమ నివారణపై దృష్టి సారించండి



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కంచిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరిలో సుడిదోమ తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కొంకేన సురేష్ రైతులకు సూచించారు. భోగాబెణి, బూరగాం, పుడాభద్ర గ్రామాల్లో వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుడిదోమ నివారణపై దృష్టి పెట్టాలన్నారు. దీని నివారణకు రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. నత్రజని ఎరువులు వేయకుండా సరైన మోతాదులోనే వేసుకోవాలని, పొలంలో ప్రతి రెండు మీటర్లకు కాలిబాటలు తీసినట్లైతే గాలీ, వెలుతురు తగినంత చేనుకు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు స్థానిక రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సోషలిజంతోనే సమస్యల పరిష్కారం

ఎచ్చెర్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సోషలిజంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. ఎచ్చెర్లలో శుక్రవారం రష్యన్ విప్లవ దినోత్సవం సందర్భంగా సోషలిజం ఔన్నత్యం- సామ్రాజ్యవాదుల దోపిడి అనే అంశంపై నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రష్యాలో మొదటిసారిగా కార్మికుల వర్గం రాజ్యాధికారంలోకి వచ్చిన తర్వాతనే 8 గంటల పనిదినాన్ని చట్టం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు సీహెచ్.అమ్మన్నాయుడు, ఎచ్చెర్ల మండల కన్వీనర్ ఎన్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల ఔదార్యం

ఇచ్ఛాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టి.బరంపురం గ్రామంలో గల మండల పరిషత్ పాఠశాలకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ముందుకు వచ్చారు. హెచ్‌ఎం ధనలక్ష్మి సమక్షంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో గ్రామ సర్పంచ్ కారంగి త్రినాథ్ తల్లిదండ్రులు కలసి పాఠశాల మొత్తానికి రంగులు వేసేందుకు రూ.20 వేల విరాళాన్ని అందజేశారు. ఇంకా అదనంగా అవసరమైతే ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ దూపాన రాజ్యలక్ష్మి, వైస్‌చైర్‌పర్సన్ మమత, గ్రామ పెద్దలు ధనుంజయరెడ్డి, నారాయణ, కేదారి, గణేష్ తదితరులు పాల్గొన్నారు

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ఆమదాలవలస, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): యువత నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని అప్పుడే మన జీవితానికి సార్థకత చేకూరుతుందని సత్యసాయి సేవా సంస్థల విద్యాజ్యోతి ప్రాజెక్టు రాష్ట్ర ఇన్‌చార్జి ఎస్.వి.ఎస్.గురుప్రసాద్ అన్నారు. ఆమదాలవలసలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో సత్యసాయి నేషనల్ లీడర్‌షిప్ ప్రో గ్రాం ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాజ్యోతి ఇన్‌చార్జి ఎం.జనార్ధనరావు, జోనల్ కన్వీనర్ ఎం.రవీంద్రబాబు, పాఠశాల ప్రిన్సిపాల్ పి.శిరీష, జిలా జాయింట్ యూత్ కో-ఆర్డినేటర్ కుమారి, ఎస్.జ్యోతి పాల్గొన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎంపీడీవో

కంచిలి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ బాలుర సంక్షేమ వసతిగృహాన్ని ఎంపీడీవో వి.తిరుమలరావు శుక్రవారం తనిఖీ చేశారు. వసతి గృహంలోని టాయిలెట్‌లు, పరిసరాలను పరిశీలించారు. ఆహార పదార్థాల నిల్వలతో పాటు రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తయారు చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీవో వీరభద్రస్వామి, టీడీపీ నాయకులు జగదీష్ పట్నాయక్, ఎంఎం పట్నాయక్, పంచాయితీ కార్యదర్శి వై.రాంబాబు, వార్డెన్ గుల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు: డీఎస్‌వో



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్‌వో సూర్యప్రకాశరావు

జి.సిగడాం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని డీఎస్‌వో సూర్యప్రకాశరావు హెచ్చరించారు. అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన రేషన్ బియ్యాన్ని వేలం వేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంఎల్‌సీ గోదాంను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 14 ఎంఎల్‌సీ గోదాంలలో 180 టన్నుల పట్టుబడ్డ బియ్యం ఉన్నట్లు తెలిపారు. వీటిని త్వరలో వేలం వేయనున్నట్లు చెప్పారు. రేషన్ షాపుల వద్ద సరుకుల నిల్వల బోర్డులను ప్రదర్శించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.సరిత, హరిశంకరరావు తదితరులు ఉన్నారు.

న్యూస్‌బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గార, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూలుగు, కళింగపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించేందుకు వీలుగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. కళింగపట్నం, బందరువానిపేట, సిలగాం, గార హెడ్‌క్వార్టర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

బొంతలకోడూరు మాజీ సర్పంచ్ మృతి

ఎచ్చెర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బొంతలకోడూరు గ్రామ మాజీ సర్పంచ్ మాడుగుల చిట్టి మహాలక్ష్మి (83) శుక్రవారం మృతిచెందారు. ఆమె 2008-13 మధ్య కాలంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా వ్యవహరించారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మహాలక్ష్మి మృతి పట్ల మాజీ సర్పంచ్ మాడుగుల వీరభద్రస్వామి సంతాపం వ్యక్తంచేశారు.

మహిళా గ్రామసభ

గార, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీకి ఎంపికైన బలరాంపురంలో శుక్రవారం మహిళా గ్రామసభ నిర్వహించారు. ఈ కార్య క్రమంలో డీఎల్‌పీవో గోపిబాల, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, డీటీఎం నాగరాజు, రిసోర్స్‌పర్సన్ ఊణ్న మహేష్, సర్పంచ్ వాసుపల్లి ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాళీమాత విగ్రహ ప్రతిష్ఠ



కాళీమాత విగ్రహం

కవిటి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కవిటిలోని కేఆర్‌కే రోడ్డులోనున్న శ్రీకాళీమాత ఆలయం వద్ద ముఖ ద్వారంతో పాటు అమవారి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కవిటికి చెందిన కృష్ణపాడి బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కంపుకొడుతున్న జిల్లా కేంద్రాసుపత్రి

- కానరాని కనీస మౌలిక వసతులు
- అధ్వానంగా పారిశుధ్యం
- మూలకు చేరిన తాగునీటి యంత్రం
- మంత్రి చెప్పినా పట్టని వైనం



పనిచేయని రక్షిత నీటి పథకం



ట్యాప్‌లేని వాష్‌బేషిన్



మరుగుదొడ్ల తలుపుల దుస్థితి

టెక్కలి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రి కంపుకొడుతుంది. మౌలిక సదుపాయాలు కూడా కానరా వడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శిస్తారని ముందుగా తెలిస్తే రొగూర్ సిని మా తరహాలో ఆ రోజు మెరుగైన పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు కల్పనకు ఆసుపత్రి సిబ్బంది ఉరుకులు, పరుగులు పెడుతుంటారు. లేదంటే పరిస్థితి దారుణంగా ఉంటుంది. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పలుచోట్ల మరుగుదొడ్ల తలుపులు శిథిలావస్థకు చేరుకోగా వాష్‌బేషిన్లకు ట్యాప్‌లు లేకపోవడం, పలుచోట్ల మరుగుదొడ్లలో ప్రజర్ ట్యాంక్‌లు పనిచేయక ఊడిపోయిన పరిస్థితి కనిపిస్తుంది. వాష్‌బేషిన్లలోనే పారిశుధ్య సిబ్బంది చీపుర్లు వంటివి పెట్టుకునే పరిస్థితి నెలకొంది. ఏ మరుగుదొడ్డి చూసినా అధ్వానంగా వదిలేశారు. ముఖ్యంగా ఆసుపత్రికి వచ్చే రోగులు కూర్చునేందుకు కుర్చీలు, బెంచీలు సౌకర్యం కల్పించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పదేపదే చెబుతున్నా.. పట్టించుకున్న నాథుడు కనిపించడం లేదు. దీంతో నేలపైనే పలువురు కూర్చోవలసి వస్తుంది. ప్రసూతి విభాగం వార్డులో గల టీవీ పనిచేయక దిష్టిబొమ్మలా కనిపిస్తుంది. పలు చోట్ల ఫ్యాన్లు పనిచేయకపోవడంతో రోగులే తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆసుపత్రి గ్రౌండ్ ఫ్లోర్‌లో గల సురక్షిత తాగునీటి పథకం మొరాయించింది. దీంతో రోగులు తాగునీటి కోసం ఆసుపత్రిలో ఇతర ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వస్తుంది. జిల్లా కేంద్రాసుపత్రి సేవలు రోజురోజుకి దిగజారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు పలుమార్లు ఆసుపత్రి యంత్రాంగానికి మౌలిక సదుపాయాలు పెంచాలని, పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఆదేశించినా ఇక్కడ స్పందించే వారే కరువయ్యారు. ఇక సుస్తీ జిల్లా కేంద్ర ఆసుపత్రిని బాగు చేయాలంటే ఆ దేవుడే దిక్కని పలువురు వాపోతున్నారు.

మరమ్మతులు చేస్తాం

జిల్లా కేంద్ర ఆసుపత్రి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం. మరమ్మతులకు గురైన మరుగుదొడ్ల తలుపులు, వాష్‌బేషిన్లు బాగుచేస్తాం. ఎక్కడెక్కడ మరమ్మతులకు గురయ్యాయో వాటిని గుర్తించి చర్యలు చేపడతామన్నారు.

- డాక్టర్ బొడ్డేపల్లి సూర్యారావు, సూపరింటెండెంట్, టెక్కలి

బైక్‌ను ఢీకొన్న ఆటో.. వ్యక్తికి గాయాలు

జలుమూరు (సారవకోట), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొన్న ఘటనలో బైక్‌పై ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కుమ్మరిగుంట గ్రామానికి చెందిన ఎస్.రమణ (52) సారవకోట నుంచి స్వగ్రామం వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా.. భగీరథీపురం గ్రామానికి చెందిన ఆటో సారవకోట సమీపంలో వెనుక నుంచి వస్తూ ఢీకొన్నాడు. ఈ ఘటనలో గాయపడిన రమణను స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సారవకోట పోలీసులు తెలిపారు.

మద్యం కేసులో జైలు, జరిమానా

టెక్కలి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన కేసులో గేదెల శేఖర్ అనే వ్యక్తికి స్థానిక జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ యు.మాధురి ఆరు నెలలు జైలు శిక్ష, రూ.2లక్షల జరిమానా విధించినట్టు టెక్కలి సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కేసును టెక్కలి ఏఎస్ఐ రమణ నమోదు చేయగా, ఏపీపీ కె.సుధారాణి వాదించారు.

వివాహిత అదృశ్యం



అదృశ్యమైన వివాహిత ఆశ

లావేరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): లావేరు పంచాయతీ కేశవరాయుపురం గ్రామానికి చెందిన బోనెల ఆశ (21) అదృశ్యమైనట్టు ఆమె భర్త బోనెల రమణ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆశ గత నెల 31న ఉదయం 10 గంటల సమయంలో బట్టలు కుట్టించుకోవడంతోపాటు చిన్న కుమారుడు చాణిక్య పేరు రేషన్ కార్డులో యాడింగ్ చేయిస్తానని చెప్పి కుమారుడితో తీసుకుని లావేరు వెళ్లింది. ఆ తర్వాత తిరిగి ఇంటికి రాలేదని, బంధువులు ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు.

అమరుల త్యాగాలను గుర్తుచేసుకోవాలి



అమరవీరులకు జోహార్లు తెలుపుతున్న వామపక్ష నాయకులు

పలాస రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అసమానతలు లేని సమాజాన్ని కాంక్షించి పోరాటం చేసి అశువులుబాసిన అమరుల త్యాగాలను గుర్తు చేసుకోవాలని వామపక్ష నాయకులు అన్నారు. బొడ్డపాడులో గల అమరవీరుల స్మారక మందిరంలో అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఎఐకేఎంఎస్ నాయకులు గొరకల బాలకృష్ణ, కుత్తుమ వినోద్, ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ వీరాస్వామి, రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎం.వినోద్, పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు బి.ఈశ్వరమ్మ, కార్యదర్శి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన రహదారి పరిశీలన



రహదారిని పరిశీలిస్తున్న వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు

పలాస, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు అడవికొత్తూరు రోడ్డు పూర్తిగా తెగిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఏపీ ట్రేడ్‌ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు శుక్రవారం వెళ్లి పరిశీలించారు. జరిగిన నష్టం, ప్రజలు పడుతున్న ఇబ్బందులపై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకువెళ్లారు. తొందరలోనే గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తామని అక్కడకు వచ్చిన ప్రజలకు భరోసా ఇచ్చారు.

రోడ్ల ఆక్రమణపై చర్యలు

టెక్కలి, నవంబర 7(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీ రోటరీనగర్-2 ప్రాంతంలో ఆక్రమణలకు గురైన రోడ్లను శుక్రవారం సంబంధిత అధికారులు పరిశీలించారు. ఈ మేరకు ఆక్రమణలు తొలగించేందుకు కొలతలు వేశారు. రోటరీనగర్ ప్రాంతంలో పలు రోడ్ల ఆక్రమణలపై స.హ. చట్టం ఉద్యమకారుడు కొంక్యాన శ్రీరామ్ కిశోర్ అర్జీ మేరకు పరిశీలించారు. సహ చట్టంలో వివరాలు కోరినా గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో సకాలంలో స్పందించకపోవడంతో స.హ. చట్టం కమిషనర్ స్పందించడంతో అధికారుల్లో కదలిక ప్రారంభమైంది. దీంతో కార్యదర్శి ఏవీ శ్రీనివాస్, సర్వే సిబ్బంది ఉన్నారు.

స్క్రీనింగ్ పరీక్షతో క్యాన్సర్‌పై విజయం

(ఐదో పేజీ తరువాయి)

పరీక్షలు నిర్వహిస్తారు. మద్యపానం, ఊబకాయం, ఆహారపు అలవాట్లు, ధూమపానం, ఇన్‌ఫెక్షన్ల ద్వారా క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. నోటి, బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా.శివరంజని, డీఐఓ డా.రాందాసు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, ప్రోగ్రాం అధికారి డా.శివరంజని, మోహిని, మురళి, సిబ్బంది, పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వజ్రపుకొత్తూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గోవిందపురం హైస్కూల్ ఆవరణంలో రాష్ట్రస్థాయి అండర్-14 అథ్లెటిక్స్ పోటీలు శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్టు హెచ్ఎం హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనున్నట్టు తెలిపారు.

స్ఫూర్తి గీతం వందేమాతరం

ఒడిశా



వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న అధికారులు

పర్లాకిమిడి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భారతీయులకు స్ఫూర్తి గీతం వందేమాతరమని జిల్లా డిప్యూటీ కలెక్టర్ అనుప్ పండా అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వందేమాతర గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. 1875, నవంబరు 7న బంకించంద్ర ఛటర్జీ అనందమఠ్ నుంచి ఈ గీతాన్ని తీసుకొని ఆలపించడం జరిగిందని, 150ఏళ్లు పూర్తయిన సందర్భంగా గుర్తుగా ఈ గీతాన్ని ఆలపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖాధికారిణి అర్చనాకుమారి, శిశు సంరక్షణ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని అధిక సంఖ్యలోని ప్రజలు వచ్చి పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చిన అర్జీలను పరిశీలించి 15రోజుల్లో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. వివిధ సమస్యలు పరిష్కారం కోరుతూ మొత్తం 357 వినతులు అందాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలతోపాటు అన్నిశాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యువతకు అవకాశాలు కల్పించడమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. చల్లవానిపేటలోని వంశధార డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించే మెగా జాబ్‌మేళాలో పాల్గొని వివిధ కంపెనీలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే అవకాశాన్ని విడచిపెట్టకుండా ఉద్యోగంలో చేరి నైపుణ్యాన్ని పెంచుకొని ఉజ్వల భవిష్యత్తును అందుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాలో 375 మంది పాల్గొనగా.. 273 మంది 11 కంపెనీలకు ఎంపి కయ్యారు. వీరికి నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి సాయికుమార్, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కరస్పాండెంట్ మధుబాబు, ప్రిన్సిపాల్ వి.శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

- పోలాకి: తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారితో మాట్లాడారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానని తెలిపారు.

ఘనంగా ధ్వజ స్తంభం ప్రతిష్ఠ



జగన్నాథస్వామి ఆలయం వద్ద ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

హిరమండలం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): హిరమండలం బస్టాండ్ వద్ద ఉన్న జగన్నాథస్వామి ఆలయం వద్ద శుక్రవారం ధ్వజస్తంభం ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. పురోహితులు గోపినంబాల లక్ష్మణాచార్యులు వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయం ముందు ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన ఉమారాణి



ఉమారాణి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

నరసన్నపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృతికి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కుప్పిలి ఉమారాణి వన్నె తెచ్చారని ఎంఈవో-2 పి.దాలినాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.వెంకట్రావు అన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన ఉమారాణి సన్మానసభ శుక్రవారం జరిగింది. మారుతున్న సమాజంలో ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అన్నారు. అనంతరం ఉమారాణి, దుర్గారావు దంపతులను సన్మానించారు.

తూనికలు, కొలతల్లో తేడాలుంటే చర్యలు



పరిశీలిస్తున్న తూనికలు, కొలతల అధికారులు

పలాస రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతల్లో తేడాలుంటే చర్యలు తప్పవని పలాస మండలం తూనికల అధికారి బలరామకృష్ణ అన్నారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలు, పలాస మండలంలో పలు ఫ్రూట్స్, రేషన్ డిపో, హార్డ్‌వేర్ షాపుల్లో తూనికలు, కొలతల తేడాలను శుక్రవారం పరిశీలన చేపట్టారు. ఫ్రూట్స్ షాపుల్లో గల తూనికల్లో తేడాలు ఉండడంతో వారికి రుసుం విధించారు. బియ్యం బస్తాల్లో తరుగు, రేషన్ డిపోల్లో 20 కేజీలకు తగ్గుదలగా ఇవ్వడం వంటివి పరిశీలిం చర్యలు చేపట్టినట్టు తెలిపారు. మొత్తం 9 కేసులు నమోదు చేసి అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. పరిశీలనలో ఆయనతో పాటు టెక్నికల్ అసిస్టెంట్ నర్సింహమూర్తి పాల్గొన్నారు.

సీవీ రామన్‌కు నివాళి



మాట్లాడుతున్న హెచ్ఎం వైకుంఠరావు తదితరులు

పాతపట్నం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో కొత్తపుంతలు తొక్కించిన మేధావి సర్ సీవీ రామన్ అని హెచ్ఎం ఎస్.వైకుంఠరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్ సీవీ రామన్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీవీ రామన్ ఎన్నో ప్రయోగాలు చేసి నోబెల్ బహుమతి పొందారని తెలిపారు. అలాగే 1954లో భారతరత్న పురస్కారమిచ్చి భారతప్రభుత్వం గౌరవించిందని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్‌టీ రామారావు, కోటి ఎస్.రామారావు రమణి తదితర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

పోలాకి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రియాగ్రహారం గరిమెళ్లకాలనీ పరిధిలో ఉన్న నూకాలమ్మ తల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం మహిళల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి తొలుత మాజీ సర్పంచ్ లావేటి కృష్ణ పూజలు చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. మహిళలు ప్రసాదాలు తయారు చేసి మొక్కులు చెల్లించుకుని అమ్మవారిని భక్తితో పూజించారు. కాలనీ మహిళలంతా కార్తీక మాసం సందర్భంగా వనబోజన కార్యక్రమం నిర్వహించారు. నూకలామ్మ తల్లి ఆలయానికి వెళ్లే రహదారిని బాగుచేయించాలని సర్పంచ్, మాజీ సర్పంచ్, ఎంపీటీసీని కాలనీ మహిళలు కోరారు కార్యక్రమంలో గ్రామపెద్ద లావేటి కృష్ణ, కాలనీ మహిళా స్వయంశక్తిసంఘాల సభ్యులు, గ్రామయువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు నగదు బహుమతి

టెక్కలి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వ్యాసరచన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. ఇటీవలన వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాచరచన పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. సీతాపురం జిల్లాపరిషత్ హెచ్ఎం టి.పద్మావతి తెలిపారు. పాఠశాలకు చెందిన భరత్, ఉదయ్‌లకు రూ.30 వేలు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు చిన్నారావు తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

హిరమండలం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కొత్తూరు సీఐ చింతాడ ప్రసాదరావు చెప్పారు. శుక్రవారం స్థానిక రామేశ్వరీ కళాశాలలో నారీ శక్తిపై విద్యార్థులకు వివరించారు. రాగింగ్‌లో జరిగేత సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎస్ఐ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఉచిత న్యాయ సహాయం

టెక్కలి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): న్యాయం దృష్టిలో అందరూ సమానులేనని, న్యాయానికి గొప్ప, బీద అనే తేడా లేదని, అర్హులైన వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందిస్తామని సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల అన్నారు. శుక్రవారం గిరిజన సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహంలో న్యాయసేవలు లభ్యత, ప్రాథమిక హక్కులు, విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాజ్యాంగంలో కల్పించిన ప్రాథమిక హక్కులు, విధులు, పాటించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, ఏజీపీ దివ్వల వివేకానంద, న్యాయవాది రాజేష్, వసతి గృహ సంక్షేమాధికారి సుదర్శనరావు, ఎస్ఐ రాము ఉన్నారు.

- కోటబొమ్మాళి: పిల్లలకు ప్రాథమిక హక్కులు, విధులు, ప్రాదేశిక సూత్రాలు, విద్య హక్కు తదితర చట్టాలు తెలుసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోషిణి అన్నారు. జాతీయ న్యాయసేవా దినోత్సవం సందర్భంగా ఆమె స్థానిక కోర్టులో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసులు, ఇతర న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నిర్మల



వ్యాసరచన పోటీలు పరిశీలిస్తున్న న్యాయాధికారి రోషిణి

పంటపోయిన రైతులకు పరిహారం

టెక్కలి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల సంభవించిన తుఫాన్‌కు పంట నష్టపోయిన రైతులను ఆదుకోనున్నట్టు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రవిబాబ్జీ తెలిపారు. శుక్రవారం జయకృష్ణారంలో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఏటా దాలిచెరువు గండి పడి పంటలు పోతున్నాయన్నారు. రైతుల సమస్యలు మంత్రి అచ్చెన్నాయుడి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో నాగమ్మ, సోమేశ్వరావు, తదితరులు ఉన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఛత్రపతి

పాతపట్నం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్‌గా కొండాల ఛత్రపతి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన కణితి శ్రీరాములు ఇటీవల పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ఎఫ్ఏసీ ప్రాతిపదికన కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు ఛత్రపతిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వివక్ష చూపకూడదు

పాతపట్నం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రొంపివలస గ్రామంలో చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ఏపీ శాక్స్ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సలహా మేరకు అడ్వకేసి మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఐసీటీసీ కౌన్సిలర్ జి.బాబూరావు మాట్లాడుతూ.. సీఎఫ్ఐ లింక్ వర్కర్ స్కీం గ్రామీణ ప్రాంతాల్లో హెచ్ఐవీ ఎయిడ్స్, టీబీ నిర్మూలన గూర్చి, వివిధ సేవల గూర్చి వివరించారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులపై వివక్షత చూపరాదన్నారు. మరింత సమాచారం కోసం 1097 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు. అనంతరం సైబర్ నేరాలు, అక్రమ రవాణా డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే నష్టంపై అవగాహన కల్పించారు. ఎంపీటీసీ ఎస్.అర్జునరావు, మాజీసర్పంచ్ తిరుపతిరావు పాల్గొన్నారు.

మొక్కలు పెంచాలి

టెక్కలి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మానవులకు ప్రకృతిపరమైన ఆక్సిజన్ లభించాలంటే మొక్కలు అనేవి అవసరమని, అందుకే మొక్కలు పెంపకానికి విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ అన్నారు. మొక్కలు పెంపకం నిర్వహణపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం టెక్కలిలో గల నర్సరీని తిలకించి అక్కడున్న మొక్కలపై వృక్షశాస్త్ర అధ్యాపకుడు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లూక్‌పాల్, అధ్యాపకులు వాసుబాబు, పరమేశ్వరరావు, రాంబాబు ఉన్నారు.


అభివృద్ధిపై దృష్టి సారించాలి

ఎల్ఎన్ పేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ నాయకులు చేస్తున్న విమర్శలు సరికాదని మండల ప్రత్యేకాహ్వానితులు రెడ్డి రామారావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కృషితో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, అదే వైసీపీ ఎమ్మెల్యే హయాంలో ఏమీ జరగలేదని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని విమర్శించడం సరికాదన్నారు. వైసీపీ నాయకులు ఎస్.సాంబశివరావు, బి.భాస్కరరావు, ఎల్.మల్లేశ్వరరావు, ఎం.అన్నాజీరావు, జనార్దనరావుల తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వండి

వజ్రపుకొత్తూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సర్వీసు ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని స్కూల్‌టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.చందనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదులో భాగంగా వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి, హుకుంపేట, కాశీనగర్, నువ్వలరేవు, మంచినీళ్లపేట పాఠశాలను సందర్శించి ఉపాదాయుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు టెట్ పరీక్ష పాసు అవ్వాలని సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ గందరగోళానికి గురిచేసిందన్నారు.

కచేరివీధిలో చెత్తాచెదారం



టెక్కలి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కచేరివీధి ప్రాంతం పూడికలు, చెత్తా చెదారంతో కంపుకొడుతున్నాయి. ఆయా ప్రాంతాల దుకాణ సముదాయదారులు చెత్తను తెచ్చి రోడ్డు పక్కన వేయడంతో అపరిశుభ్రత నెలకొంది. అయితే రోడ్లు మీద తిరిగే ఆవులు, కుక్కలు, పందులు వాటిని కదిలించడంతో దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు అంటున్నారు. పంచాయతీ యంత్రాంగం చెత్తాచెదారాన్ని తొలగించాలని స్థానికులు కోరతున్నారు

దోమపోటుతో జాగ్రత్త

మందస, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దోమపోటు రాకుండా పొట్ట దశలో రైతులు పైరుకు ప్రత్యేక మందులను పిచికారీ చేయాలని వ్యవసాయశాఖ ఏడీ రామారావు రైతులకు సూచించారు. మందస మండలంలో రైతుసేవా కేంద్రాలను శుక్రవారం సందర్శించి రైతులతో మాట్లాడారు. రాత్రివేళల్లో మంచు అధికంగా ఉన్నందున అగ్గితెగులు సోకే ప్రమాదం ఉందని, ట్రైసైక్లోజోల్ 150 గ్రాములు పిచికారి చేయాలని దోపోటుకు డినోఫ్యూరాన్‌మరియు పైమెట్రోజీమ్‌ను 120 ఎంఎల్ పిచికారీ చేయాలని సూచించారు. సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు. ఆయనతో పాటు ఏవో నాగరాజు పాల్గొన్నారు.

జీవనశైలి మార్చుకోవాలి

సంతబొమ్మాళి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జీవనశైలి మార్చుకోవడం ద్వారా క్యాన్సర్ వ్యాధిని దూరం చేయవచ్చని బోరుభద్ర పీహెచ్‌సీ వైద్యాధికారి అవని అన్నారు. శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా బోరుభద్రలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బోరుభద్ర సర్పంచ్ బుసకల లక్ష్మీకాంతం లక్ష్మయ్య పాల్గొన్నారు.

- మెళియాపుట్టి: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరిలో అవగాహన ఉండాలని చాపర పీహెచ్‌సీ వైద్యాధికారి పావణి తెలిపారు. శుక్రవారం జాతీయ క్యాన్సర్ దినం సందర్భంగా చాపరలో ర్యాలీ నిర్వహించారు.